# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-08-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు దేశవ్యాప్తంగా రైతులకు అన్నదాత – సుఖీభవ పిఎం కిసాన్ నిధులు విడుదల చేస్తారు.**

**2.** **కేంద్ర రహదారుల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరి ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతిలో ఈరోజు పర్యటిస్తారు.**

**3.** **పర్యాటక కేంద్రంగా గండికోటను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**4.** **తెలంగాణలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.**

**5.** **అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.**

=========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నియోజకవర్గంలో ఈరోజు పర్యటిస్తారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని పిఎం కిసాన్ 20వ విడత కింద దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాలకు 20 వేల 500 కోట్ల రూపాయల జమ చేస్తారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా దర్శి మండలం లో ఈరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నదాత – సుఖీభవ పిఎం కిసాన్ పథకం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.

-------------------------

కేంద్ర రహదారుల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరి ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతిలో ఈరోజు పర్యటిస్తారు. ఈ సాయంత్రం గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగే కార్యక్రమంలో 29 జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొంటారు.

-------------------------

అద్భుతమైన పర్యాటక కేంద్రంగా గండికోటను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. వైఎస్ ఆర్ కడప జిల్లా గండికోట వద్ద ఆంధ్ర ప్రదేశ్ టూరిజం ఇన్వెస్టర్స్ సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పర్యాటక ప్రాంతాల్లో 50 వేల హోటల్ గదులు నిర్మాణం చేసేలా కార్య చరణ చేపట్టామని వెల్లడించారు. గండికోట వద్ద వ్యూ పాయింట్, ఎకో ఫ్రెండ్లీ టెంట్ సిట్ బోటింగ్ తో పాటు కోట వద్ద లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో రైతులను శక్తిమంతం చేసేందుకు కేంద్రం 6 వేల 520 కోట్లు రూపాయలు కేటాయించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. దేశవ్యాప్తంగా 50 ఆహార శుద్ధి యూనిట్లు, 100 ఆహార తనిఖీ ప్రయోగశాలలు, పంట కోత వ్యర్థాలను తగ్గించేందుకు చేపట్టిన చర్యలను ఆయన అభినందించారు.

మరోవైపు కేంద్ర గనుల శాఖ ప్రతిష్ఠాత్మక ఏడు జాతీయ సాంకేతిక సంస్థలను 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్' కింద సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ఎంపిక చేయడంపైనా కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కడప స్టీల్ ప్లాంట్ తొలి దశ పనులు 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేసేలా ఆదేశాలిచ్చామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

- వాయిస్.. 29 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు ప్రభుత్వం అందించే ఉచిత విద్యుత్ పథకాన్ని ఈనెల 7వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. నేతన్నలకు ఈ పథకం కింద మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు అందజేయనున్నట్లు ఆయన వివరించారు. నేతన్నలకు 365 రోజుల పాటు పని కల్పించడంతో పాటు వారి కుటుంబాలు గౌరవ ప్రదమైన జీవనం సాగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. నల్గొండ జిల్లాలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1ను ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ..

- వాయిస్..30 సెకన్లు

---------------------------

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ

మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కంటోన్మెంట్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాల్లో మంత్రి నిన్న పాల్గొన్నారు. గతంలో నిలిచిపోయిన రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలుపుతూ..

– వాయిస్.. 27 సెకన్లు

--------------------------

భారత త్రివర్ణ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధులు పింగళి వెంకయ్య జయంతి ఈరోజు. యావత్ భారతదేశం గౌరవించే జాతీయ జెండాను రూపొందించింది తెలుగు వ్యక్తి కావడం మనకు గర్వకారణం. 1876, ఆగస్టు 2న కృష్ణా జిల్లా భట్ల పెనుమర్రులో ఆయన జన్మించారు. పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని జాతీయ పతాకంగా గుర్తిస్తూ 1921 మార్చి 31, ఏప్రిల్ 1న విజయవాడలో మహాత్మాగాంధీ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఆ తర్వాత ఆ పతాకానికి కొద్దిగా మార్పులు చేశారు. గొప్ప దేశభక్తుడు, భూగర్భ శాస్త్రవేత్త, రచయిత అయిన పింగళి వెంకయ్య భారతదేశానికి ఒక జాతీయ పతాకం' అనే పుస్తకాన్ని రచించారు. కార్మిక, కర్షకులపై ఆధారపడిన భారతదేశం, సత్య, అహింసలను ఆచరించడంతో సుభిక్షంగా ఉంటుందనే ఆశయానికి చిహ్నంగా ఆయన రూపొందించిన త్రివర్ణ పతాకం తరతరాలకు తరగని సంపదగా నిలిచింది.

--------------------------

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ నామినేషన్ స్వీకరణ గడువు ఆగస్టు 15వ తేదీ వరకు పొడిగించినట్లు కేంద్ర ప్రభుత్వ మహిళ శిశు సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి త్రిప్తి గుర్హ తెలిపారు. వివిధ రంగాల్లో పిల్లల అసాధారణ విజయాలను గుర్తించి వారిని అభినందించడానికి ఈ పురస్కారాలను బహుకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవార్డులను ధైర్యం, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళా సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ అనే విభాగాల కింద అందించనున్నట్లు వివరించారు.

--------------------------

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య అయిదో క్రికెట్ టెస్టు ఓవల్ స్టేడియం వేదికగా కొనసాగుతోంది. నిన్న జరిగిన రెండో రోజు ఆటలో భారత్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులకు ఇంగ్లాండ్ ఆలౌట్ చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్ 247 పరుగులకు ఆలౌటైంది. ప్రస్తుతం భారత్ రెండో ఇన్నింగ్స్ లో 2 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ 51, ఆకాశ్‌దీప్ 4 పరగులు వద్ద బ్యాటింగ్ చేస్తున్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి జి. లక్ష్మీ తెలియజేస్తూ....

వాయిస్...18 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ నాలుగు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================